ఆంధ్రజ్యోతి
**
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
ఆదివారం 7 జనవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	220	240
సూర్యాపేట	రూ.130	192	221
నల్లగొండ	రూ.132	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.2 । కనిష్ఠం 16.0

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో..

నేడు ముత్యాల ముగ్గుల పోటీ



సూర్యాపేట, జనవరి 6: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేటలో జరుగనున్నాయి. స్థానిక జమ్మిగడ్డలోని హౌజింగ్ బోర్డు కాలనీలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పోటీలు కొనసాగుతాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొననున్న ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీల్లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొంటూ రాష్ట్రస్థాయి పోటీలకు కూడా ఎంపికవుతున్నారు. రంగులతో పోటీలు జరిగే స్థలానికి సకాలంలో చేరుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. ఈ పోటీల విజేతలకు జోనా హెల్తీ ఫుడ్స్ సంస్థ బహుమతులు అందించనుంది.

ఆన్‌లైన్ నమోదును సక్రమంగా చేపట్టాలి



ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు

భానుపురి, జనవరి 6 : ప్రజాపాలన సందర్భంగా స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. శనివారం సూర్యాపేట మునిసిపాలిటీలో నిర్వహిస్తున్న దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మొదటి రోజు సాయంత్రం 5 గంటల వరకు 23 మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో 17,661, మునిసిపాలిటీల్లో వార్డుల వారీగా 5,597 మొత్తం 23,258 దరఖాస్తులను డేటా ఎంట్రీ పూర్తయిందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి, మెప్మా పీడీ రమేష్‌నాయక్, ప్రత్యేక అధికారి జడ్పీ సీఈవో సురేష్‌కుమార్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

- భువనగిరిపై ప్రధాన పార్టీల నజర్ ● ఐదు జిల్లాల్లోని నేతలతో చర్చలు
- నియోజకవర్గాల వారీగా అభిప్రాయ సేకరణ
- అన్ని పార్టీల్లోనూ టికెట్ కోసం పోటాపోటీ



లోక్‌సభ ఎన్నికలకు ప్రధాన పార్టీలు సై అంటున్నాయి. ఈ మేరకు నియోజకవర్గాల వారీగా సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ బిజీబిజీగా ఉన్నాయి. శాసనసభ ఎన్నికలతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణంలో తీవ్రంగా పెనుతుఫాన్ చెలరేగింది. తెలంగాణ ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన బీఆర్ఎస్‌ను గద్దె దింపి, అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుంది. గతంతో పోలిస్తే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పుంజుకుంది.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

మరో నాలుగు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలకు భారత ఎన్నికల కమిషన్ రంగం సిద్ధం చేస్తోంది. ఎన్నికల నిర్వహణపై జిల్లా యంత్రాంగాలతో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తోంది. పకడ్బందీగా లోక్‌సభ ఎన్నికలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలన్నీ లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుని, తమ సత్తా చాటాలని తహతహలాడుతున్నాయి. ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీతోపాటు బీఆర్ఎస్, బీజేపీలు 10నుంచి 15సీట్లను చేజిక్కించుకోవాలని అధిష్ఠానాలు వ్యూహాలు రచిస్తున్నాయి. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని ప్రధాన పార్టీల్లోనూ ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. దీంతో అధిష్ఠానాలకు ఎంపీ అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సాములా మారింది. హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంపై అన్ని పార్టీలు కూడా ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని యాదాద్రిభువనగిరి, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, జనగామ జిల్లాల పరిధిలోని ఇబ్రహీంపట్నం, మునుగోడు, భువనగిరి, నకిరేకల్, తుంగతుర్తి, ఆలేరు, జనగామ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటాయి. అన్ని పార్టీల నుంచి ఈసారి లోక్‌సభ ఎంపీగా పోటీ చేసేందుకు మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీలోని సీనియర్ నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై అధిష్ఠానాలు కసరత్తు చేస్తున్నాయి. ఈ మేరకు పార్టీ సీనియర్ నేతలతో సమావేశాన్ని కూడా నిర్వహించాయి. ఈ ఎన్నికల్లో అభ్యర్థులను ఎవరిని బరిలో దింపాలన్న అంశంపైనే ప్రధానంగా చర్చలు సాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, తీన్మార్ మల్లన్న, తదితరులు ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, తెలంగాణ ఉద్యమ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, జనగామ నియోజకవర్గం నుంచి పొన్నాల లక్ష్మయ్య టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. బీజేపీ నుంచి గత పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు పీవీ.శ్యాంసుందర్‌రావు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, తదితరులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ పడి, త్యాగం చేసిన వారికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్న యోచనలో అధిష్ఠానాలు ఉన్నాయి. అయితే ఎమ్మెల్యే టికెట్ కోసం పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాలామంది సీనియర్ నేతలు ఆశావహులుగా ఉన్నారు. అభ్యర్థులు మాత్రం తమకే టికెట్ వస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు.

బీజేపీ 10 స్థానాలపై గురి



లోక్‌సభ ఎన్నికలు బీజేపీకి అనుకూలంగా మలుచుకునేందుకు ఆ పార్టీ అగ్ర నేతలు కసరత్తు చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీ కనీసం 10లోక్‌సభ స్థానాల్లో గెలుపొందాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈమేరకు ఆ పార్టీ అధిష్ఠానం పెద్దలు రాష్ట్రంలోని సీనియర్ నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. త్వరలోనే పార్లమెంట్ స్థాయిలో కోర్‌కమిటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్నికల్లో ఎవరిని అభ్యర్థిగా బరిలో దించాలన్న అంశంపై రాష్ట్ర కమిటీతోపాటు బీజేపీ అగ్రనేతలు హాజరై సమాలోచనలు చేశారు. ఈ మేరకు పార్లమెంట్ స్థాయిలోని విస్తారకలతో బీజేపీ ఇన్‌చార్జీ సునీల్ బన్సల్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో అత్యధిక స్థానాల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, పార్టీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇటీవల పార్టీలో చేరిన నేతలతో పాటు, సీనియర్ నేతల కలయికతో బూత్ కమిటీలు, మండల కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణలో అత్యధిక స్థానాలే లక్ష్యంగా బీజేపీ అడుగులు వేస్తోంది.

నియోజకవర్గాల వారీగా అభిప్రాయ సేకరణ

ఎంపీ అభ్యర్థులుగా ఎవరిని ఎంపిక చేయాలన్న అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీలోని సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలతో పాటు స్థానిక నేతల అభిప్రాయాల సేకరణలో నిమగ్నమవుతున్నాయి. ఈమేరకు లోక్‌సభ ఎన్నికలపై ముందుకు వెళ్లేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు వరుస సమీక్షలు నిర్వహిస్తున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నేతలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి, ఎంపీ అభ్యర్థుల ఎంపికపై అధిష్ఠానాలు కసరత్తు చేస్తున్నాయి. అయితే అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభిప్రాయ సేకరణలో భాగంగా స్థానిక నేతలకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ వచ్చే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో పార్టీలోని నాయకులందరినీ ఏకం చేసి, ఆర్థికంగా, రాజకీయ పరంగా సమర్థంగా ఉన్న నేతల వైపు అధిష్ఠానాలు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. పకడ్బందీ వ్యూహంతో ఎన్నికల కదన రంగంలోకి దిగేందుకు అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రధాన పార్టీలు అడుగులు వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్న నేతలు ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. బీజేపీ నేత శ్యాంసుందర్‌రావు 'విజన్ భువనగిరి' పేరుతో అన్ని పార్టీలు, ప్రజా సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ సమావేశాలు ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఇన్‌చార్జీలను నియమించిన కాంగ్రెస్



కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహార కమిటీ(పీఏసీ) ఇటీవల సమావేశాన్ని నిర్వహించింది. రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను నియమించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఒక్కో నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటాయి. నల్లగొండ పార్లమెంట్ పరిధిలో నల్లగొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, సూర్యపేట, కోదాడ, హుజుర్‌నగర్, దేవరకొండ శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గానికి ఇటీవలి వరకు ఎంపీగా పనిచేసి, మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఇన్‌చార్జీగా నియమించింది. భువనగిరి నియోజకవర్గం పరిధిలో భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం (రంగారెడ్డిజిల్లా), జనగాం(జనగాం జిల్లా) శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. భువనగిరి నియోజకవర్గానికి కూడా ఇటీవల వరకు ఎంపీగా ఉండి, ఇటీవల మంత్రి అయిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది. ఈ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపించుకునే బాధ్యతలను ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలకు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక కమిటీలు వేసేందుకు చర్యలు తీసుకుంటోంది.

బీఆర్ఎస్ కసరత్తు



గతంలో బీఆర్ఎస్ సారు..కారు.. పదహారు అన్న నినాదంతో ముందుకు వెళ్లగా..ఈసారి మాత్రం ఆచితూచి అడుగులు వేస్తోంది. బీఆర్ఎస్ పార్టీ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓటమిని చవిచూసింది. ఉద్యమ పార్టీ అయి ఉండి...చాలా చోట్ల కూడా భారీ ఓట్ల మెజార్టీతో అభ్యర్థులు ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. ఈ నేపథ్యంలో పార్టీ అభ్యరుల ఓటమికి గల కారణాలపై అన్వేషణ ప్రారంభించింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు ఆ పార్టీ అగ్రనేతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు త్వరలోనే పార్టీలోని మాజీ మంత్రులతో పాటు పొలిట్‌బ్యూరో సభ్యులు, సీనియర్ నేతలతో నియోజజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటుచేస్తోంది. అభ్యర్థులఎంపికపై తెలంగాణ ఉద్యమకారులతోపాటు సీనియర్ నేతలతో సమాలోచనలు చేస్తోంది.

1234881

ఉమ్మడి జిల్లాలో 'ప్రజాపాలన' దరఖాస్తులు

భానుపురి, జనవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం పథకంలో ఆరు గ్యారెంటీలకు లబ్ధిదారుల నుంచి అపూర్వ స్పందన లభించింది. గత నెల 28న ప్రారంభమైన ఈ ప్రక్రియ ఎనిమిది రోజులపాటు కొనసాగి శనివారం ముగిసింది. ఎనిమిది రోజుల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12,34,881 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నల్లగొండ జిల్లాలో 6,11,853, సూర్యాపేట జిల్లాలో 3,62,203, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2,60,825 దరఖాస్తులను అధికారులు, ప్రజాప్రతినిధులు స్వీకరించారు. ఈ నెల 5న కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఆపరేటర్లు ఇప్పటివరకు అందిన దరఖాస్తులను ఈ నెల 17వరకు ఆన్‌లైన్ చేయనున్నారు.

జిల్లాలో 3,62,203 దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం పేరిట ఆరు గ్యారెంటీ పథకాల కోసం ప్రజా పాలన పేరుతో చేపట్టిన దరఖాస్తుల స్వీకరణకు జిల్లాలో విశేష స్పందన లభించింది. డిసెంబరు 28 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు(డిసెంబరు 31, జనవరి 1 సెలవు) చేపట్టిన కార్యక్రమానికి ప్రజలు ఆరు గ్యారెంటీ పథకాల కోసం పెద్దసంఖ్యలో దరఖాస్తులు అందజేశారు. మొత్తం ఎనిమిది రోజుల్లో జిల్లాలోని 23 మండలాల్లోని 475 గ్రామపంచాయతీలు, ఐదు మునిసిపాలిటీల నుంచి మొత్తం 3,62,203 దరఖాస్తులు స్వీకరించారు. గ్రామపంచాయతీల నుంచి 2,84,834 దరఖాస్తులు రాగా పట్టణాల నుంచి 77,369 దరఖాస్తులు వచ్చాయి. వాటన్నింటికి కౌంటర్ల వద్ద పారదర్శకతతో కౌంటర్ ఇన్‌చార్జిలు రశీదులు అందజేశారు. ప్రజాపాలనలో చివరి రోజైన శనివారం 40,271 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ వెంకటరావు తెలిపారు. జిల్లాలోని 12 గ్రామపంచాయతీల్లో 28,139, మునిసిపాలిటీల్లోని వార్డుల్లో 12,132 దరఖాస్తులు వచ్చాయి.



మోతెలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో 'ప్రజాపాలన' దరఖాస్తులు ఇలా..

తేదీ	యాదాద్రి	సూర్యాపేట	నల్లగొండ	మొత్తం
డిసెంబరు 28	11,132	8,809	38,760	58,701
29	20,475	35,109	38,858	94,442
30	35,474	56,874	78,550	1,70,898
31	సెలవు	-	-	-
జనవరి 1	సెలవు	-	-	-
2	39,033	70,953	93,276	2,03,262
3	42,148	58,271	86,104	1,86,523
4	38,281	51,547	90,462	1,80,290
5	31,319	40,369	78,873	1,50,561
6	42,963	40,271	1,06,970	1,90,204
మొత్తం	2,60,825	3,62,203	6,11,853	12,34,881

బరాఖత్‌గూడెంలో

ఉపముఖ్యమంత్రి భట్టి




వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న భట్టి విక్రమార్క

మునగాల రూరల్/ సూర్యాపేట రూరల్, జనవరి 6 : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శనివారం సందర్శించారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తూ మార్గమధ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. విక్రమార్కను ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎలక బిందు నరేందర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, బసవయ్య పాల్గొన్నారు. అంతకు ముందు సూర్యాపేటలోని సెవెన్ హోటల్‌లో కొద్దిసేపు ఆగిన ఉపముఖ్యమంత్రి విక్రమార్కను మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి, అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్, భైరు శైలేందర్ ఉన్నారు.

అయోధ్య రామయ్య సన్నిధికి


200 క్వింటాళ్ల బియ్యం విరాళం




సోమనర్సయ్యను సన్మానిస్తున్న అమర్నాథ్ సేవా సమితి సభ్యులు

భానుపురి, జనవరి 6: అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అయోధ్యలో నిర్వహిస్తున్న అన్నదాన వితరణకు జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య 200 క్వింటాళ్ల బియ్యాన్ని(రూ.10 లక్షల విలువైన) తిరుమలగిరిలో శనివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో అన్నదాన కార్యక్రమం నిర్వహణకు తనవంతు సహాయసహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా కోట్లమంది ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొంటున్నారని, వారికి అన్నదానం చేయడం ఆనందాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో అమర్నాథ్ సేవా సమితి వ్యవస్థాపక చైర్మన్ చికోటి మధుసూదన్, నిర్వాహకులు నల్లచంద్రం, కాశం విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.







యాదగిరిగుట్టలో శాస్త్రోక్తంగా

స్వాతి జన్మనక్షత్ర వేడుకలు

సంప్రదాయరీతిలో ధనుర్మాస పర్వాలు



మహాకుంభ కలశాన్ని తీసుకువెళుతున్న ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహా చార్యులు, చిత్రంలో మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులు, ఈవో రామకృష్ణారావు తదితరులు

యాదగిరిగుట్ట, జనవరి 6: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం స్వాతి జన్మనక్షత్ర పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన ఆచార్యులు ముఖమండపంలో అష్టోత్తర శతకలశాలను ఏర్పాటు చేశారు. వేదమంత్ర పఠనాలతో హోమ పూజలు జరిపి, గర్భాలయంలోని మూలమూర్తులను అష్టోత్తర శతకలశాలతో అభిషేకించి, సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా స్వామిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నృసింహుడి జన్మనక్షత్రం సందర్భంగా భక్తులు, స్థానికులు కొండచుట్టూ గిరిప్రదక్షిణలు చేసి కొండపైన ప్రధానాలయంలోని మూలమూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ప్రభాతవేళ అష్టభుజి ఉత్తర దిశలోని మొదటి ప్రాకార మండపంలో ఆండాళ్ అమ్మవారి తిరుప్పావై పర్వాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. మహిళా భక్తుల మంగళనీరాజనాలు పాడారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజా కైంకర్యాలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయంలోనూ స్వామి జన్మనక్షత్రం సందర్భంగా విశేష పూజలు కొనసాగాయి. కాగా స్వామివారి జన్మనక్షత్రం స్వాతిని పురస్కరించుకుని మాజీ గవర్నర్ ఈఎస్ఎల్.నరసింహన్ దంపతులు అష్టోత్తర శతఘటాభిషేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం వీరికి అర్చకులు చతుర్వేద ఆశీర్వచనం చేశారు. దేవస్థాన ఈవో రామకృష్ణారావు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. లక్ష్మీనృసింహుడిని తెలంగాణ రాష్ట్ర రీజనల్ ఫైర్ అధికారి హరినాథ్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్పీ శృతికీర్తి దర్శించుకున్నారు. వీరు ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.29,40,458 ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.

మట్టపల్లిలో భక్తవత్సలుడికి

గరుడోత్సవం



మఠంపల్లి, జనవరి 6 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని ప్రసిద్ధ క్షేత్రమైన మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో శనివారం స్వామి, అమ్మవార్ల నిత్యకల్యాణంతో పాటు గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. తర్వాత ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు పూర్తిచేశారు. అదేవిధంగా కల్యాణోత్సవంలో భాగంగా మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలను కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం ఆలయ తిరువీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగించి ఆలయ ప్రవేశం చేయించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, ఎన్‌సీఎల్ పరిశ్రమ ప్రెసిడెంట్ చక్రధర్, అర్చకులు పాల్గొన్నారు.

రామాలయంలో లక్ష కుంకుమార్చన

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని రామాలయంలో లక్ష కుంకుమార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారికి ప్రత్యేకపూజలు కొనసాగాయి. కార్యక్రమంలో ఈవో గుజ్జుల కొండారెడ్డి, రంగాచార్యులు, రాఘవాచార్యులు, నర్సింహాచార్యులు, మురళీచార్యులు, భాస్కరాచార్యులు, పద్మ, గోపాల్, సుశీల, దామోదర్, శ్రీనివాసాచారి, శ్రీనివాస్, సీత పాల్గొన్నారు.

శ్రీరామ పాదుకలకు ప్రత్యేక పూజ



శ్రీరామపాదుకల వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వలిగొండ, జనవరి 6 : త్వరలో అయోధ్య రామాలయంలో వినియోగించే శ్రీరాముడి పాదుకలకు యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని హరిహర త్రిశక్తి క్షేత్రంలో వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం నుంచి పాదుకలతో రథయాత్రగా బయలుదేరిన ప్రత్యేక వాహనం శనివారం వలిగొండకు చేరింది. గోవింద నామస్మరణతో దేవాలయంలోకి పాదుకలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రథయాత్ర బృంద సభ్యుడు బాలాజీ మాట్లాడుతూ మూడేళ్ల క్రితమే ఈ యాత్రను ఆరంభించినట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం శృంగేరీ మఠం జగద్గురువులు పాదుకలకు తొలి పూజలు జరిపిన తదుపరి అయోధ్యలో శ్రీరామ పట్టాభిషేకానికి తరలిస్తున్నట్లు వివరించారు. దేశంలో 16 పవిత్ర నదీ జలాలు, నదీ మృత్తికలను కూడా రామయ్య చెంతకు తీసుకెళ్తున్నామన్నారు. కోటి ఇళ్లలో పూజలు జరిపిన తదుపరి అయోధ్యకు చేరుస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 20న అయోధ్యకు ఈ యాత్ర చేరుతుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోళ్ల లలితాశ్రీనివాస్, దేవాలయ నిర్వాహకులు గోపాలకృష్ణ, మనోహరి, అర్చకులు దత్తాత్రేయ శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య ఆలయ ప్రారంభ కరపత్రాల ఆవిష్కరణ

నార్కట్‌పల్లి, జనవరి 6: అయోధ్యలో రామాలయం ప్రారంభానికి సంబంధించిన కరపత్రాలను శనివారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయోధ్య అక్షింతలను అర్చకులు కారంపూడి వేంకటాచార్యులు, కృష్ణమాచార్యులు భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దూదిమెట్ల స్రవంతి, పాల్వాయి భాస్కర్‌రావు, మునుకుంట్ల గణేశ్, గంధం భాస్కర్, బిళ్లకంటి శ్రీకాంత్, జెల్లి దశరథ, పసునూరి పాండురంగయ్య, దోసపాటి వేణు, బండారు రమేశ్, ఓంప్రకాశ్, రాజేశ్వరి పాల్గొన్నారు.



అయోధ్య రామాలయ కరపత్రాలను ప్రదర్శిస్తున్న భక్తులు

చలికి వెచ్చవెచ్చగా





వారం రోజుల నుంచి చలి తీవ్రత పెరగడంతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రతను తట్టుకోవడానికి నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామ యువకులు ఇలా చలిమంటలు వేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం చిన్నపడిశాలలో ఇటీవల జన్మించిన లేగదూడను చలి నుంచి రక్షించేందుకు రైతు ముస్కు ప్రతాప్‌రెడ్డి గోనె సంచి ఏర్పాటుచేశారు. (శాలిగౌరారం/ అడ్డగూడూరు)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. వేములపల్లి, నార్కట్‌పల్లి, తిప్పర్తిలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.


గంగదేవరగట్టు వద్ద బోల్తాపడిన లారీని క్రేన్‌సహాయంతో తీయిస్తున్న పోలీసులు

వేములపల్లి, జనవరి 26 : డ్రైవర్ నిద్రమత్తులో లారీ పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో క్లీనర్ మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ రాజేంద్ర గార్జె, క్లీనర్లు వన్వె ఆశీష్‌బాలు(18), ధోత్రే రాహుల్‌తో కలిసి శుక్రవారం అర్ధరాత్రి నెల్లూరు నుంచి మహారాష్ట్రకు బేకరీ వస్తువులతో బయలుదేరారు. ఈ క్రమంలో శనివారం ఉదయం వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం గ్రామశివారు లోని గంగదేవరగుట్ట సమీపంలోకి రాగానే డ్రైవర్ రాజేంద్ర నిద్రమత్తులోకి జారుకోవడంతో లారీ అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆశీష్‌బాలు లారీ కింద చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ రాజేంద్ర, మరో క్లీయర్ ధోత్రే రాహుల్‌కు స్వల్పగాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి చేరుకుని క్రేన్ సహాయంతో లారీని రోడ్డుపైకి తీయించారు. ఆశీష్‌బాలు మృతదేహాన్ని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. క్లీనర్ రాహుల్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


ఆశీష్‌బాలు మృతదేహం

ట్రాక్టర్ ఢీ కొని వ్యక్తి...


రామచంద్రం(ఫైల్)

నార్కట్‌పల్లి, జనవరి 6 : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇన్‌చార్జి ఎస్‌ఐ రవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అక్కెనపల్లికి చెందిన పాలసంఘం మాజీ చైర్మన్ ముద్దం రామచంద్రం(52) తనకు వరుసకు సోదరుడైన అంజయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై కక్కిరేణి దారిలో వెళ్తున్నారు. అదే దారిలో ఎదురుగా మట్టిలోడుతో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలై రామచంద్రం మృతి చెందగా, స్వల్ప గాయాలైన అంజయ్యను నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రిలో చికిత్స అందితున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

కారు బోల్తాపడిన ఘటనలో..

తిప్పర్తి, జనవరి 6 : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో కారు బోల్తాపడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ ఎన్ ధర్మ తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణం బంగారిగడ్డ ప్రాంతానికి చెందిన ఎండీ ఆసీఫ్(36) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు నెలల కిందట తండ్రి మృతిచెందడంతో నిద్రచేసేందుకు తల్లి సుల్తానాను కారులో తీసుకొని హైద్రాబాద్‌లోని వారి బంధువుల ఇంటి వద్ద దించి రావడానికి శుక్రవారం ఉదయం వెళ్లి అదే రోజు రాత్రి తిరిగి బయలుదేరాడు. ఆ క్రమంలో తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి గ్రామం శివారులోని కల్వర్టు వద్ద రాత్రి 12 గంటల సమయంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆసీఫ్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 వాహనం సహాయంతో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఆసీఫ్ భార్య బీబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్. ధర్మ తెలిపారు. ఆసీఫ్‌కు భార్యతో పాటు ఒక పాప ఉన్నారు.

గుంతలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- ఏడుగురు ప్రయాణికులకు తప్పిన ప్రమాదం
- సూర్యాపేట జిల్లా మోతె మండలంలో ఘటన
- ముందు వెళుతున్న వాహనాన్ని దాటుతుండగా ప్రమాదం




మామిళ్లగూడెం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిన రాజధాని బస్సు, ఘటనలో ధ్వంసమైన బస్సు ముందు భాగం

మోతె, జనవరి 6: ముందు వెళుతున్న వాహనాన్ని దాటే క్రమంలో ఓ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రహదారి పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లింది. శనివారం సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని మామిళ్లగూడెం వద్ద ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ప్రయాణికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా డిపోకు చెందిన రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సు (టీఎస్ 09 జడ్ 7679) హైదరాబాద్ నుంచి ఖమ్మం బయలుదేరింది. సూర్యాపేటలో కొంతమంది ప్రయాణికులు దిగగా బస్సులో ఏడుగురు ఉన్నారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మోతె మండలంలోని మామిళ్లగూడెం గ్రామ సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద ముందు వెళ్తున్న డీసీఎంను ఓవర్‌టేక్ చేయబోయి వెనుకనుంచి ఢీకొంది. ఈ క్రమంలో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ఏడుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలుకాగా, ఒకరి తలకు గాయమైంది. బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రయాణికులను ఖమ్మం జిల్లాకు వెళ్తున్న మరో బస్సులో తరలించారు. బస్సు డ్రైవర్ నాగేంద్రచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. ఓవర్‌టేక్ చేసే సమయంలో బస్సు బ్రేకులు సరిగా పడకపోవడంతో డీసీఎంను తగిలి రహదారి పక్కగా ఉన్న గుంతలోకి దూసుకెళ్లినట్లు డ్రైవర్ నాగేంద్రాచారి తెలిపారు.

జీచెన్నారంలో పట్టపగలే చోరీ

కనగల్, జనవరి 6 : నల్లగొండ జిల్లా కనగల్ మండలం జీచెన్నారం గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన ఉప్పునూతల పరమేష్ అతడి భార్య సత్తమ్మ రోజువారీగా శుక్రవారం ఇంటికి తాళం వేసి వేర్వేరు పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు భద్రపర్చిన రూ.లక్షన్నర నగదును చోరీచేశారు. కాగా సాయంత్రం నాలుగున్నర గంటలకు కళాశాల ముగించుకుని పరమేష్ కుమార్తె ఇంటికి తిరిగివచ్చింది. ఇంటికి వేసిన తాళం, బీరువా తాళాలు పగలగొట్టి ఉండటంతో విషయాన్ని ఫోన్‌లో తల్లిదండ్రులకు వివరించింది. దీంతో వారు ఇంటికి పరిశీలించి నగదు చోరీ అయినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారాన్ని తెలిపారు. గేదెల కొనుగోలు కోసం తన తల్లి పేరున మూడు రోజుల కిందటే బ్యాంకులో రుణం తీసుకువచ్చి పెట్టానని పరమేష్ వివరించాడు. గేదెల కొనుగోలుకు ప్రయత్నాలు చేస్తుండగానే దొంగతనం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

కొండమల్లేపల్లి, జనవరి 6 : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో బైక్ చోరీ కేసును పోలీసులు చేధించారు. రెండు బైకులను స్వాధీనం చేసుకుని చోరీకి పాల్పడిన వ్యక్తులను రిమాండ్ చేశారు. శనివారం కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ రాఘవేందర్ రెడ్డి వివరించారు. కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని పాత గ్రామానికి చెందిన బోడ యాదయ్య బుల్లెట్ గత ఏడాది అక్టోబరు 27న చోరీకి గురైంది. ఈ క్రమంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు తిప్పర్తి మండలం ఖాజీరామారం గ్రామానికి చెందిన గుంటికంపు మధుకుమార్‌తో పాటు కోదాడకు చెందిన కారం శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. దీంతో చోరీకి గురైన బుల్లెట్‌తో పాటు నకిరేకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైన మరో పల్సర్‌బైక్‌ను కూడా వారి నుంచి స్వాధీనం చేసుకుని, ఇరువురిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ వీరబాబు, ఏఎస్‌ఐ ఆంజనేయులు, హేమానాయక్, గురువారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మరో కేసులో

కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీలో జనవరి 1న రమావత్ పూల్‌సింగ్ ఇంట్లో రూ.90వేల నగదు చోరీకిగురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నగదును దొంగలించిన దేవరాయ సత్యనారాయణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

ఐదుగురు బాల కార్మికుల గుర్తింపు

తిప్పర్తి, జనవరి 6 : ఆపరేషన్ స్మైల్ బృందం ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో ఐదుగురు బాలకార్మికులను గుర్తించారు. ఆపరేషన్ ముస్కాన్ ఎస్‌ఐ పీ.శంకరయ్య తన సిబ్బందితో చేసిన తనిఖీల్లో మండలంలోని రామలింగాలగూడెం వద్ద ఉన్న సత్యనారాయణ కాటన్ ఇండస్ట్రీస్‌లో నలుగురు మైనర్లు, తిప్పర్తి మండల కేంద్రంలోని హెచ్‌పీ, పెట్రోల్ బంకులో ఒక బాలకార్మికుడు ఉన్నట్లుగా గుర్తించారు. బాలకార్మికులను తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కాటన్ మిల్లు యజమానులు శివరామ్, శ్రీనివాస్, పెట్రోల్ బంకు నిర్వాహకులు సతీష్‌లపై కేసు నమోదు చేయాలని తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

విద్యార్థిని మిస్సింగ్ కేసు నమోదు

భువనగిరి టౌన్, జనవరి 6 : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణం హుస్సేనాబాద్‌కు చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఎస్ సుధీర్‌కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాల వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన బాలిక సాయంత్రానికి ఇంటికి తిరిగి రాలేదు. శనివారం కూడా వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారని, దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తాం

కోదాడ రూరల్, జనవరి 6: సూర్యాపేట జిల్లా కోదాడ ఎంపీపీ చింతా కవిత అక్రమాలపై ఎంపీటీసీ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని ఆర్డీవో సూర్యానారాయణ తెలిపారు. ఎంపీపీ కవిత అనేక అక్రమాలకు పాల్పడ్డారని, అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను దుర్వినియోగం చేశారని, మండల పరిషత్ జనరల్ ఫండ్ నుంచి నెలకు రూ. 50 వేల చొప్పున సొంత ఖర్చుల కోసం డ్రా చేశారని ఆరోపిస్తూ ఏడుగురు ఎంపీటీసీలు జిల్లా కలెక్టర్ వెంకటరావుకు ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో 10 రోజుల్లో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆర్డీవోను ఆదేశించారు. ఈ క్రమంలో శనివారం ఆర్డీవో విచారణ చేపట్టారు. మండల పరిషత్‌కు సంబంధించిన తారకరామ కాంప్లెక్స్‌లో అద్దె చెల్లింపులో జరిగిన అవకతవకలపై విచారణ పూర్తి చేశామని, పాత ఎంపీడీవో కార్యాలయం ముందు నిర్మించిన షాపుల నిర్మాణం, షాపులకు సంబంధించిన కిరాయిలను కూడా ఎంపీపీ తీసుకుంటున్నారని ఎంపీటీసీలు చేసిన ఆరోపణలపై కూడా విచారణ పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని ఆర్డీవో తెలిపారు.

ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదు

నల్లగొండ, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు కట్టుబడిఉందని ప్రభుత్వంపై ప్రతిపక్షాల ఆరోపణలు సరికాదని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేకల భద్రాద్రి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులు కాకముందే ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ కాంగ్రెస్‌ను 420 అంటూ ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. అధికారం కోల్పోవడంతో బీఆర్‌ఎస్ నాయకులు నోటికి వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల లోనే రెండు స్కీంలను ప్రారంభించిందన్నారు. ఈ నెల మరో రెండు స్కీంల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు.

శతాధిక వృద్ధులు మృతి

శాలిగౌరారం, జనవరి 6: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో ఇద్దరు శతాధిక వృద్ధులు శనివారం మృతి చెందారు. శాలిగౌరారం గ్రామ పంచాయతీ పరిధిలోని పావురాలగూడెం గ్రామానికి చెందిన మద్ది నర్సింహారెడ్డి(104), గురజాల గ్రామానికి చెందిన చామల రమణమ్మ(105) అనారోగ్యంతో మృతి చెందారు. మద్ది నర్సింహారెడ్డి మృతదేహానికి మనవరాలు తలకొరివి పెట్టింది.

దేశం, ధర్మం కోసం జీవితాన్నే త్యాగం చేసిన షణ్ముఖ


షణ్ముఖ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రామగిరి, జనవరి 6 : దేశం, ధర్మం కోసం జీవితాన్నే త్యాగం చేసిన వ్యక్తి శ్రీరామోజు షణ్ముఖ అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో షణ్ముఖ సంతాపసభను నిర్వహించారు. ఈ సందర్భంగా షణ్ముఖ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షణ్ముఖ తన చిన్ననాటి నుంచే జాతీయ భావజాలంతో దేశం, సంఘం కోసం పనిచేశారన్నారు. ఎమర్జెన్సీ విధించిన సమయంలో నల్లగొండలో కరపత్రాలను రూపొందించి పంచిపెట్టిన మొదటి వ్యక్తి షణ్ముఖ అని అన్నారు. ఆ సమయంలో జైలు జీవితం కూడా గడిపారన్నారు. విద్యార్థి పరిషత్ విభాగంలో పనిచేస్తున్న సందర్భంలో విద్యార్థులను మార్గదర్శకంలో ముందుకు తీసుకురావడానికి అనేక కార్యక్రమాలు చేపట్టారనన్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా పనిచేశాడన్నాడు. కార్యక్రమంలో బీజేపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు వీరెల్లి చంద్రశేఖర్, నూకల నర్సింహారెడ్డి, గార్లపాటి జితేందర్‌కుమార్, పట్టణ నాయకులు భాస్కర్, రాజయ్య, గుండెగాని నాగయ్య, సురిగి మారయ్య, పాలకూరి రవి, స్వర్ణకార సంఘ జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి, కొల్లోజు సత్యనారాయణ, బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ప్రతి దరఖాస్తునూ ఆన్‌లైన్ చేయాలి



సూర్యాపేటలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో సురేష్‌కుమార్



హుజూర్‌నగర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



నేరేడుచర్లలో ఆన్‌లైన్ డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఆర్డీవో

సూర్యాపేటరూరల్, జనవరి 6: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తునూ ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని జడ్పీ సీఈవో సురేష్‌కుమార్ ఆదేశించారు. సూర్యాపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. సూర్యాపేట మండలంలో 12,477 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్‌రావు ఉన్నారు.

మోతె: ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని కోదాడ నియోజకవర్గ ప్రత్యేకాధికారి గూడ వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని సిరికొండలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. దరకాస్తులు గ్రామంలో ఇవ్వలేని వారు మండలకేంద్రంలో అధికారులకు అందజేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నూకల సావిత్రమ్మ పాల్గొన్నారు.

తిరుమలగిరి: మునిసిపాలిటీ పరిధిలో 6,190, మండలంలో 9,561 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు మునిసిపల్, మండలం పరిషత్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ దండు శ్రీను, ఎంపీడీవో కె. ఉమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: ప్రజాపాలన దరఖాస్తులను డేటా ఎంట్రీ చేయాలని పీడీ కిరణ్‌కుమార్, తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీని పరిశీలించారు. మండలంలో 10,612 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, ఎంపీవో రాజేష్, సీనియర్ అసిస్టెంట్ రామారావు, ఆర్ఐ వహిదోద్దీన్ పాల్గొన్నారు.

చిలుకూరు: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖ అధికారి రూపేందర్‌సింగ్ అన్నారు. దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీ కార్యక్రమాన్ని పరిశీలించారు. దరఖాస్తులను ఈ నెల 17వ తేదీలోగా ఆన్‌లైన్ ఎంట్రీ పూర్తి చేస్తామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సరిత, ఎంపీడీవో ఈదయ్య, వీఆర్ఏఈ లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్: అధికారులు అంకితభావంతో పనిచేసినప్పుడు ప్రజల్లో గుర్తింపు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కమిషనర్ శ్రీనివాసరెడ్డిని అదే విధంగా 8,9, 11, 14, 25వ వార్డుల్లో ప్రజాపాలన అధికారులకు పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కస్తాల శ్రావణ్, గల్లా వెంకటేశ్వర్లు, కోలపూడి యోహాన్, సులువ చంద్రశేఖర్,అన్నపూర్ణ, ముత్యాలు, హేమలత,చంద్రకళ,రేణుక, త్రివేణి,సైదులు,అశోక్,వెంకటేష్, బొల్లెద్దు ధనమ్మజైలు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వేపలసింగారంలో సర్పంచ్ అన్నెం శిరీషకొండారెడ్డి దరఖాస్తులు స్వీకరించారు.

నేరేడుచర్ల: దరఖాస్తులను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో కొనసాగుతున్న దరఖాస్తులు ఆన్‌లైన్ డాటా ఎంట్రీని పరిశీలించారు. ఒక్క దరఖాస్తు కూడా మిస్ కాకుండా వచ్చిన దరఖాస్తును ఎంట్రీ చేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మేనేజర్ అశోక్‌రెడ్డి, చైర్మన్ జయబాబు, నాగయ్య, ప్రకాష్ సులోచన, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: బంజారహిల్స్‌తండాలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎంపీడీవో బాణాల శ్రీనివాస్, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల అధికారులు అనూష, అజయ్‌నాయక్, రవి, కృష్ణ సందీప్, సర్పంచ్ భిక్షంనాయక్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: అర్హులైన పేదలందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజాపాలన మండల ప్రత్యేకాధికారి ఏడీఏ సంధ్యారాణి అన్నారు. శనివారం దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ మంగా రాథోడ్, ఎంపీడీవో జనకిరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రభుదాసు, గాదె జయభారత్‌రెడ్డి, బుడిగ హుస్సేన్‌గౌడ్,రవి, శౌరి, మలికంటి బుచ్చయ్య, మహేష్‌గౌడ్, తవడబోయిన నాగేశ్వరావు, జోసు, జానీపాషా, దగ్గుపాటి మహేష్, నందిపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలో 16,838 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని ఎంపీడీవో విజయశ్రీ తెలిపారు.

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరుగ్యారెంటీల పథకాలకు ప్రజలు పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. అందులో నియోజకవర్గం మొత్తంలో 1,00,368 మంది ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఐదు గ్యారెంటీలకు నియోజకవర్గం మొత్తంలో 15,753 దరఖాస్తులు వచ్చాయి. హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు 11,368, నేరేడుచర్ల మున్సిపాలిటిలో 3854, చింతలపాలెం 11,710, గరిడేపల్లి 19,228, హుజూర్‌నగర్ 8941, మఠంపల్లి 14,065, మేళ్లచెర్వు 13,060, నేరేడుచర్ల 8983, పాలకవీడు 9,159 దరఖాస్తులు వచ్చాయి. ఏడు మండలాల్లో ఐదు గ్యారెంటీలకు 14,230 దరఖాస్తులు రాగా, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఏడు మండలాల్లో 85,146 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం ఐదు గ్యారెంటీలు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు కలిపి మొత్తం 1,16,101 దరఖాస్తులు వచ్చాయి.



చిలుకూరులో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న అధికారి రూపేందర్‌సింగ్

కార్యకర్తలు అధైర్యపడొద్దు : మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి

మఠంపల్లి, జనవరి 6: ఎన్నికల్లో గెలుపు, ఓటమి సహజమని, బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మండలంలోని లాలితండా, భీల్యానాయక్‌తండా, కొత్తతండా తదితర గ్రామాల్లో శనివారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయాలన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు కృషిచేయలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇరుగు పిచ్చయ్య, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌నాయక్, హఫీజ్‌ఖాన్, భరత్‌నాయక్, బాలునాయక్, తులసీరాం, శ్రీనునాయక్, రాజేష్‌నాయక్, మట్టపల్లినాయక్ ఉన్నారు.

లైంగికదాడి నిందితులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా శిక్షించాలి

మేళ్లచెర్వు, జనవరి 6: లైంగికదాడి నిందితులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా శిక్షించాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ అన్నారు. మండలకేంద్రంలో శనివారం సంఘం సభ్యత్వాలు నమోదు చేయించారు. 2024 లోక్‌సభ ఎన్నికలలోపే మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలందరికీ సంక్రాంతిలోగా రూ.2500 ఇవ్వాలన్నారు. మహిళల సమస్యల పట్ల ఐక్యంగా పోరాడుతామన్నారు.

'పండుగకు అదనపు రేషన్ కేటాయించాలి'

మఠంపల్లి, జనవరి 6: సంక్రాంతి పండుగకు అదనపు కోటాను కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. మఠంపల్లిలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రేషన్ షాపుల ద్వారా గతంలో తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేసేవారని, ప్రభుత్వం తిరిగి ఆ విధానాన్ని అమలు చేయాలన్నారు. రంజాన్, క్రిస్మస్, బతుకమ్మలకు దుస్తులు పంపిణీ చేసిన మాదిరిగానే సంక్రాంతి పండుగకు అదనపు రేషన్‌ను అందించాలన్నారు. రేషన్ డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అమరావరపు పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలయ్యేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రయ్య

మునగాల రూరల్, జనవరి 6: ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి చందా చంద్రయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గృహ అవసరాల కోసం వినియోగదారులకు అందిస్తామన్న 200 యూనిట్ల విద్యుత్ సరఫరాలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. లబ్ధిదారులకు రూ.500లకే గ్యాస్ ఇచ్చే విషయంలో ఆలస్యం ఎందుకని నిలదీశారు. అధికారం చేపట్టిన వెంటనే రూ.2లక్షల రైతుల రుణమాఫీ చేస్తామన్న హామీ ఏమైందన్నారు. రుణమాఫీ, రైతుబంధు కోసం రైతాంగం ఎదురు చూస్తున్నారని తెలిపారు. యాసంగి సీజన్‌లో రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం తిప్పలు పడుతున్నారన్నారు. ధాన్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్‌గా ఇచ్చి రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు బచ్చలకూర స్వరాజ్యం, దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి ఉన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

ఆత్మకూర్(ఎస్), జనవరి 6: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల మూడు డీఏలు వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పేరం ముత్తయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్ ఆవరణంలో సంఘం క్యాలెండర్, డైరీలను శనివారం ఆవిష్కరించారు. సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్ మాస్టార్ శంకర్‌నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుభాని, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు మందాటి అశోక్, జిల్లా జానయ్య, మంచాల శ్యామ్ కుమార్, రవికుమార్, వడ్లకొండ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



శంకుస్థాపన చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నేరేడుచర్ల, జనవరి 6: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. సీతారామయ్య కోరారు. స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. నేరేడుచర్లలో ఈ భవన నిర్మాణంతో నియోజకవర్గంలో అన్ని మండలాలలో భవన నిర్మాణాలు పూర్తి అవుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, వేద పండితులు ఓంకార్, సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడ రాంబాబు, కోశాధికారి హమీద్‌ఖాన్, బొడ్డుపల్లి సుందరయ్య, చంద్రశేఖర్, చింతగుంట్ల పూర్ణచంద్రారెడ్డి, పోతుగంటి సత్యనారాయణ, పులిజాల వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు.

సేవా పతకానికి ఎంపికైన కానిస్టేబుల్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

కోదాడటౌన్, జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ పోలీసు సేవా పతకానికి ఎంపికైన కానిస్టేబుల్ సోమపంగు శ్రీనివాస్‌లను ఎంఈఎఫ్ ఉద్యోగులు శనివారం పట్టణంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు, లెనిన్, కత్తి వెంకటేశ్వర్లు, రమేష్, వెంకటరత్నం, చౌరి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



కోదాడలో నినాదాలు చేస్తున్న డ్రైవర్లు

కోదాడ టౌన్, జనవరి 6: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టంతో డ్రైవర్లు రోడ్డు పాలు కావడమేనని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భూక్యా రవి అన్నారు. కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ చట్టాన్ని తీసుకరావడాన్ని నిరసిస్తూ శనివారం లారీ డ్రైవర్లు పట్టణంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం అనుకోకుండా జరుగుతుందని, ఆ నెపంతో లారీడ్రైవర్లకు పదేళ్ల జైలు శిక్ష రూ.7 లక్షల జరిమానా అంటూ తెచ్చిన కొత్త చట్టాన్ని కేంద్రం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజునాయక్, శివలాల్, శ్రీను, నాగేశ్వరరావు, చంద్రశేఖర్ ఉన్నారు.

సామగ్రి ఇవ్వకుంటే ఇంటి ఎదుట దండోరా మోగిస్తాం



వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

తిరుమలగిరి రూరల్, జనవరి 6: దళితబంధు పథకం తమ నుంచి జీఎస్టీ పేరుతో రూ.4 నుంచి రూ.5 లక్షలు కాజేశారని జలాల్‌పురం దళితబంధు లబ్ధిదారులు ఆరోపించారు. ఈ మేరకు సూర్యాపేటలో జిల్లా వాణిజ్య పన్నుల అధికారికి శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమలగిరి పట్టణానికి చెందిన శ్రీమల్లికార్జునస్వామి ఐరన్, హార్డ్‌వేర్ యజమాని జీఎస్టీ కట్టకుండానే లక్షలు కాజేశారని ఆరోపించారు. యజమాని తమకు సంబంధించిన సామగ్రిని ఇవ్వకపోతే ఇంటి ఎదుట దండోరా మోగించి హక్కు సాధించుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారులు ఫిర్యాదుపై జిల్లాఅధికారి వివరణ ఇస్తూ బిల్లులు ఇవ్వకుండా జీఎస్టీ కట్టడం సాధ్యం కాదన్నారు. అధికారిని కలిసిన వారిలో కొమ్ము రమేష్, ఎల్లయ్య, వెంకన్న, కృష్ణయ్య, ముత్తయ్య, యల్లమ్మ, సుజాత, శ్రీను, చిరంజీవి, సురేష్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ కే జ్యోతి

గరిడేపల్లి, జనవరి 6: నాబార్డు ద్వారా వ్యవసాయ రంగంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట ఎస్బీఐ రీజనల్ మేనేజర్ కె.జ్యోతి అన్నారు. శనివారం మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో రైతులు, వ్యవసాయ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. నాబార్డు ద్వారా వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం రుణాలు అందిస్తుందన్నారు. వివిధ రంగాలకు బ్యాంకులు అందిస్తున్న రుణాల వివరాలను ఆమె వివరించారు. అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ ద్వారా వ్యవసాయ ఉత్పత్తి, కిసాన్ క్రెడిట్ కార్డు, పాడి పరిశ్రమపై మైక్రో ఎంటర్‌ప్రైజెస్, కుటీర గ్రామీణ పరిశ్రమలు, కళలు, చేతి పనుల అభివృద్ధి సాధికారత కోసం రుణాలను అందిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేతి పనులు ఇతర అనుబంధ వాణిజ్య రంగాల ద్వారా రైతులకు ఇస్తున్న సబ్సిడీల గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డీ.నరేష్, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, సత్యనారాయణ, కేవీకే శాస్త్రవేత్తలు సీహెచ్.నరేష్, డీ.ఆదర్శ్, మాధురి, నరేష్ పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత: ఎమ్మెల్యే



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి

మోతె, జనవరి 6: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కోదాడ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్‌పద్మావతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపల్లిలో సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ, నూతన ఆలయ నిర్మాణం, ధ్వజస్తంభం ఏర్పాటు సందర్భంగా నిర్వహించిన పూజల్లో ఆమె పాల్గొన్నారు. ప్రజలందరూ కులమతాలకతీతంగా పండుగలు నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం ఇటీవల నేషనల్ చాంపియన్ షిప్‌లో మూడో స్థానం, రాష్ట్రస్థాయిలో మొదటిస్థానం సాధించిన మోతె మండలం నామవరం గ్రామానికి చెందిన కత్తుల సల్మాన్‌రాజ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రమేష్, నంద్యాల అరుణ, కీసర సంతోష్‌రెడ్డి, నూకల మధుసూదన్‌రెడ్డి, వాసంశెట్టి శేఖర్, నరేష్, రాములునాయక్ ఉన్నారు.

కోదాడ రూరల్: దైవచింతన కోసం కొంత సమయం కేటాయించాల్సిన అవసరముందని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. మండలంలోని కొమరబండలో షిరిడి సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పొనుగోటి జానకిరామయ్య, వంగవీటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలి : కలెక్టర్

సూర్యాపేటఅర్బన్/భానుపురి జనవరి 6 : విద్యార్థులు చదువులతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్ కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శరీర దారుఢ్యం పెరుగుతుందన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, అదేవిధంగా క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటుకోవాలన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్వీ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్ వనం సత్యేందర్, కళాశాల సెక్రటరీ హనుమంతరావు, చంద్రజిత్‌సింగ్, మంజిత్‌రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలు

భానుపురి, జనవరి 6: జిల్లాస్థాయి డిక్లమేషన్(వక్తృత్వ) పోటీలు జనవరి 8వ తేదీన సూర్యాపేటలోని తెలంగాణ గిరిజన మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువజన కేంద్ర జిల్లా అధికారి ప్రవీణ్‌సింగ్ ప్రకటనలో తెలిపారు. 'మై భారత్-వికసిత భారత్ 2047' అనే అంశంపై జిల్లాస్థాయి డిక్లమేషన్ పోటీ ఉంటుందని తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. 'మై భారత్-వికసిత భారత్' అనే అంశంపై ఏడు నిమిషాలు ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషల్లో ప్రసంగించాలని సూచించారు. జిల్లాస్థాయిలో పోటీల్లో గెలిచిన యువతకు ప్రశ్నంస పత్రంతో పాటు మెమోంటో అందిస్తామన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5గంటల లోపు సెల్: 9052798602 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు హుజూర్‌నగర్‌లో కబడ్డీ జట్ల ఎంపిక

భానుపురి, జనవరి 6: అంతర్ రాష్ట్ర జూనియర్ బాల, బాలికల కబడ్డీ టోర్నమెంట్‌కు జిల్లా కబడ్డీ జూనియర్ బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక ఈలనె 7వ తేదీన హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపిక చేయనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రామచందర్‌గౌడ్ తెలిపారు. 5-2-2004 తర్వాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. బాలురు 70 కిలోల బరువు కలిగి ఉండాలని, బాలికలు 65కిలోల బరువు ఉండాలని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, జిరాక్స్ కాపీలు అందజేయాలన్నారు.

10న సూర్యాపేటలో స్కేటింగ్ జిల్లాస్థాయి పోటీలు

భానుపురి, జనవరి 6: సూర్యాపేటలో ఈ నెల 10న ఉమ్మడి నల్గొండ (యాద్రాది భువనగిరి, నల్గొండ, సూర్యాపేట) జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్-14,17 సంవత్సరాల బాల బాలికలకు సూర్యాపేటలోని నూతన వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులందరూ బోనఫైడ్ సర్టిఫికెట్లతో 10వ తేదీ ఉదయం 9గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

రేపటి నుంచి తాడ్వాయిలో ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలు

మునగాల రూరల్, జనవరి 6: మండల పరిధిలోని తాడ్వాయి గ్రామంలో ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు తాడ్వాయి యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జట్ల పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. మొదటి బహుమతి రూ. 20,016, ద్వితీయ బహుమతి రూ.15,016, తృతీయ బహుమతి రూ.12,016, చతుర్థ బహుమతి రూ.10,016, ఐదో బహుమతి రూ.7,016 ఇవ్వనున్నట్లు తెలిపారు.

విద్యార్థుల సభకు అనుమతి నిరాకరణ సరికాదు

భానుపురి, జనవరి 6: ఏపీ రాష్ట్రం గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించాలనుకున్న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభకు అనుమతి నిరాకరించడం సరికాదని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు అన్నారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఏపీ రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ తీరు సరికాదన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు, నాయకులు ములకలపల్లి రవి, జి. ఎల్లయ్యమాదిగ, కొండపల్లి ఆంజనేయులు, ఏపూరి రాజు, బాలయ్య, రాము, దైద వెంకన్న, దాసరి వెంకన్న, బొజ్జ వెంకన్నమాదిగ, తాటిపాముల నవీన్, చెరుకుపల్లి సతీష్, కొండేటి గోపి, చింతా సాంబయ్య పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్, జనవరి 6: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హుజూర్‌నగర్‌కు చెందిన టీపీసీసీ కార్యదర్శి ఈడ్పుగంటి సుబ్బారావు, టీపీసీసీ సభ్యులు దొంగరి వెంకటేశ్వర్లు, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ యరగాని నాగన్నగౌడ్ శనివారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సన్మానించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

కోదాడ: లాయర్ల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. లాయర్లు బాధ్యతతో వృత్తిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో లాయర్లు, చింతకుంట్ల రామ్‌రెడ్డి, వీరబద్రం ఉన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కోదాడ : కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న జువాలజీ, కెమిస్ట్రీ, అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. నాగు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెట్, పీహెచ్‌డీతో పాటు టీచింగ్ అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులకు పీజీలో 50శాతం మార్కులు, ఓసీ, బీసీ అభ్యర్థులకు 55శాతం మార్కులు ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు దరఖాస్తులను కళాశాలలో అందించాలని తెలిపారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

మద్దిరాల: తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో ఆదివారం నిర్వహించే ఉపాధ్యాయుల సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల కార్యదర్శి రమావత్ రమేష్ అన్నారు. మండల కేంద్రంలో సమావేశ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని పాతర్లపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా, ఎలాంటి అనుమతి లేకుండా వెలసిన వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. మండల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో శనివారం వినతిపత్రం అందజేశారు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టానుసారంగా ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు చేసి గ్రామ పంచాయతీలకు కేటాయించాల్సిన భూములను కేటాయించకుండా అమ్ముకుంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంటిబాబు, మహేష్, ఉపేందర్, శంకర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా వెంకట్‌రెడ్డి

సూర్యాపేట: టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు వెంకట్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

23న చిమిర్యాల సహకార సంఘం సమావేశం

కోదాడ రూరల్ : చిమిర్యాల ప్రాథమిక సహకార పరపతి సంఘం ప్రత్యేక సమావేశం ఈ నెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు సీఈవో జొన్నలగడ్డ క్రిష్ణ తెలిపారు. సహకార సంఘం చైర్మన్ ముత్తవరపు రమేష్‌పై సింగిల్ విండో డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై 23న జిల్లా సహకార అధికారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సమావేశంలో చైర్మన్ ముత్తవరపు రమేష్‌పై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై విచారణ జరుగుతుందన్నారు. ఇప్పటికే సింగిల్ విండో డైరెక్టర్లందరికీ నోటీసులు జారీ చేశామని తెలిపారు.

రేపు కోదాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కోదాడ రూరల్: కోదాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మండలంలోని ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలంలోని రామగిరి నుంచి మూసొడ్డు తండా గ్రామానికి వెళ్లే రహదారి బీటీ రోడ్డు పనులను జడ్పీటీసీ రాపోలు నర్సయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకటరెడ్డి, సర్పంచ్ సైదమ్మ, నాయకులు రవీందర్‌రెడ్డి, పాపిరెడ్డి, వెంకటరెడ్డి, పాండునాయక్, కిరణ్‌నాయక్, సైదానాయక్, శ్రీను, కోటి సురేష్‌రెడ్డి, శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.